క్లుప్తంగా

రైతులు అధైర్యపడొద్దు

నారాయణఖేడ్: నిజాంపేట్‌– నారాయణఖేడ్‌– బీదర్‌ 161బీ జాతీయ రహదారి విస్తరణ కోసం భూసేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు అధైర్యపడొద్దని ఆర్డీఓ వెంకటేష్‌ అన్నారు. ఖేడ్‌ మండల పరిధిలోని బాణాపూర్‌ పంచాయతీ కార్యాలయంలో రైతులతో కలిసి మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులోని భూములు, వాటికి సంబంధించిన పరిహారం తదితర విషయాలను రైతులకు సమగ్రంగా వివరిస్తూ సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో తహశీల్దారు దేవదాస్‌, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

నిందితుడికి ఆరునెలల జైలు

నారాయణఖేడ్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతికి కారకుడైన కారు డ్రైవర్‌కు ఆరు నెలల జైలుశిక్షను విధిస్తూ నారాయణఖేడ్‌ మున్సిఫ్‌ మేజిస్ట్రేట్‌ శ్రీధర్‌ తీర్పు ఇచ్చినట్లు నారాయణఖేడ్‌ పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ఖేడ్‌ మండల పరిధిలోని జుజాల్‌పూర్‌ గ్రామ శివారులో బూతపల్లి నర్సయ్య (40)ను టాటా ఇండికా కారుతో బీదర్‌ జిల్లా చిల్లర్గికి చెందిన డ్రైవర్‌ శివాజీ రావు అతివేగం, అజాగ్రత్తగా 2017లో నర్సయ్యను ఢీకొట్టగా తీవ్ర గాయాలై మృతి చెందాడు. దీంతో మృతుడి సోదరుడు రాములు ఫిర్యాదు చేయగా అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన జడ్జి నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్లు వివరించారు.

పంటల వివరాలను నమోదు చేసుకోండి



జుల్కల్‌లో పంటల వివరాలను నమోదు చేసుకుంటున్న అధికారులు

కంది(సంగారెడ్డి): రబీ సీజన్‌లో సాగు చేసుకుంటున్న పంటల వివరాలపై రైతులు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రసాద్‌ అన్నారు. మంగళవారం కంది మండల కేంద్రంలో పంటల నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేసే పంటల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవడం ద్వారా పంటల కొనుగోలుతో పాటు పంట నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నెల 15వరకు పంటల వివరాలను నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

జహీరాబాద్‌ టౌన్: జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎల్‌అండ్‌టీ ఆధ్వర్యంలో మండల సరిహద్దులోని చెక్‌పోస్టు సమీపంలో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోటారు వెహికిల్‌ ఇన్‌స్పెక్టర్‌ నరేంద్రనాయక్‌ మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడం ద్వారా ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. వాహనాల వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు అతికించాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోండి

సంగారెడ్డి టౌన్: ఇటీవల బ్లాస్టింగ్‌లో గాయపడిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అడిషనల్‌ కలెక్టర్‌ చంద్రశేఖర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్దనూర్‌ గ్రామంలోని క్రషర్‌ అక్రమ బ్లాస్టింగ్‌లో రైతు రమావత్‌ భీముడు కుడిచేతిని కోల్పోయాడన్నారు. క్రషర్‌ యాజమాన్యం ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండానే బ్లాస్టింగ్‌ నిర్వహించడం సహించరానిదన్నారు. క్రషింగ్‌ కంపెనీని వెంటనే మూసివేయాలని డిమాండ్‌ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు రామకృష్ణ, రవి, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

టమాటా తెగుళ్లపై రైతులకు అవగాహన

జహీరాబాద్: టమాటాకు సోకే తెగుళ్ల విషయమై రాజేంద్రనగర్‌లోని ఉద్యాన కళాశాల విద్యార్థినులు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని చిన్న హైదరాబాద్‌ గ్రామంలో మంగళవారం ఇన్ఫర్మేషన్‌ కార్నర్‌ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టమాటో పంటకు ఆకుమాడు, ఆకు ముడత, భక్తిరాట్‌ మచ్చ తెగులు, తెల్లదోమ, సూది పురుగు, కాయతొలుచు పురుగుల వల్ల కలిగే నష్టాల, వాటిని గుర్తించే విధానం, నివారణ చర్యలపై వారి గ్రామీణ ఉద్యాన శిక్షణ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రదీప్‌కుమార్‌, విద్యార్థినులు శివానీ, సౌమ్య, సంతోషినిరెడ్డి, శ్రీజారావు, రక్షిత, వైష్ణవి, శ్రీనిధి, సుప్రియ, ఉషశ్రీ, సాహితీతి, సంధ్యమతి, రైతులు శివన్న, అశోక్‌, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, మొల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. జర పైలం

- శిథిలావస్థలో బ్రిడ్జీలు, కల్వర్టులు
- భయాందోళనకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



సంఘం(కె) శివారులో ప్రమాదకరంగా కల్వర్టు



బోరెగావ్‌ గ్రామ శివారులోని బ్రిడ్జిపై కుంగిన రోడ్డు



మాచ్నూర్‌ గ్రామ శివారులో కూలిపోయిన కల్వర్టు

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జీలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఝరాసంగం, న్యాల్కల్‌ మండలాలతో పాటు ఆందోల్‌ నియోజకవర్గంలోని రాయికోడ్‌, మునిపల్లి, తదితర మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన వాహనదారులు జహీరాబాద్‌ పట్టణానికి వివిధ పనులపై ఝరాసంగం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. మండలంలోని చాలా చోట్ల నిర్మించిన బ్రిడ్జీలు, కల్వర్టులు ఇరుకుగా మారి శిథిలావస్థకు చేరాయి.

తప్పని ఇబ్బందులు

అధికారుల నిర్లక్ష్యం పట్టింపులేని తనంతో బ్రిడ్జీలు, కల్వర్టుల వద్ద వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఝరాసంగం నుంచి జహీరాబాద్‌ వెళ్లే ప్రధాన రహదారి పక్కన 20కి పైగా బ్రిడ్జీలు, కల్వర్టులు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న రోడ్డుకు తక్కువ విస్తీర్ణంలో ఉన్న బ్రిడ్జీలు, కల్వర్టుల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో వాహనదారులకు దగ్గరకు వచ్చేంత వరకు వాటిని గుర్తించలేకపోతుండటంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. పలుమార్లు బ్రిడ్జీలు, కల్వర్టులను ఢీకొని ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయి. మాచ్నూర్‌ గ్రామ శివారులో ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న గోడలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని ధ్వంసమయ్యాయి. సంఘం (కే) గ్రామ శివారులోని ఉన్న బ్రిడ్జికి ఓ పక్కన బీటీ పూర్తిగా కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన చోట నూతనంగా బ్రిడ్జీలు, కల్వర్టుల నిర్మాణాలను చేపట్టి రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పారిశుధ్యం.. అస్తవ్యస్తం

- కేతకీ వాలద్రి వాగులో పేరుకుపోయిన చెత్తాచెదారం
- దుర్వాసన వెదజల్లుతున్న ఆలయ పరిసరాలు
- గుంపులుగా పందుల సంచారం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న భక్తులు



ఆలయం ముందు ఉన్న వాలద్రి వాగులో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణకాశిగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర ఆలయ పరిసరాలు అధికారుల నిర్లక్ష్యం, పారిశుధ్య నిర్వహణ లోపంతో దుర్వాసనను వెదజల్లుతున్నాయి. ఆలయం ముందు ఉన్న వాలద్రివాగులో చెత్తచెదారం పూర్తిగా పేరుకుపోయింది. దీంతో నెలలు గడుస్తున్నా పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ఆలయ అధికారుల తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఆలయ పరిసరాల్లో పందులు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ..

ఆలయ అధికారుల పర్యవేక్షణ లోపంతో ఆలయం ముందు ఏర్పాటు చేసిన నల్లాల వద్ద పాకురు పేరుకుపోయి కాళ్లు కడుక్కునేందుకు వెళ్లే సమయంలో జారి పడుతూ భక్తులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై పలుమార్లు ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ఆలయ అధికారులు వెంటనే స్పందించి పరిసరాలను పరిశుభ్రం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాటా శ్రీనివాస్‌గౌడ్‌

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్‌ ఆధ్వర్యంలో మంగళవారం తెల్లాపూర్‌ మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్‌, బీఎస్పీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఆంజనేయులు, ఎల్లయ్య, హనుమంతరావు, అఖిల్‌, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు ఉన్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం

- మౌలిక వసతుల కల్పనకు కృషి
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: డివిజన్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని జేపీ కాలనీ, శిశుమందిర్‌ రోడ్డు, బండ్లగూడ కాలనీల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్‌ కుమార్‌యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం యాదవ సంఘం శ్మశానవాటికలో కార్పొరేటర్‌ కుమార్‌యాదవ్‌ సౌజన్యంతో నిర్మించనున్న దహనవాటిక నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయకుమార్‌, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్‌, మాజీ కార్పొరేటర్‌ సపానదేవ్‌, గోపాల్‌, ధనరాజ్‌గౌడ్‌, మాజీ వార్డుమెంబర్‌ చంద్రశేఖర్‌, సీనియర్‌ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకం

10వ తరగతి పరీక్షలు అత్యంత కీలకమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్‌ ఫంక్షన్‌ హాల్‌లో పటాన్‌చెరు, అమీన్‌పూర్‌, రామచంద్రాపురం మండలాలతో పాటు తెల్లాపూర్‌, అమీన్‌పూర్‌ మున్సిపల్‌ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జీవీఆర్‌ ఎంటర్‌ప్రైజెస్‌ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస ప్రేరణ తరగతులను ప్రారంభించారు. అనంతరం సొంత నిధులచే కొనుగోలు చేసిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పీపీ రాథోడ్‌, ఎంపీపీ సుష్మాశ్రీ, జెడ్పీటీసీలు సుధాకర్‌ రెడ్డి, సుప్రజ, దశరథ్‌రెడ్డి, పట్నం రాజు, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్‌ వీరేందర్‌, డాక్టర్‌ పూర్ణ కృష్ణ, పాల్గొన్నారు.

మంజీరా తాగునీటి సరఫరా ప్రారంభం

రామచంద్రాపురం (పటాన్‌చెరు): భారతినగర్‌ డివిజన్‌ పరిధిలోని మ్యాక్‌ సొసైటీ కాలనీ, హెచ్‌ఐజీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మంజీరా తాగునీటి సరఫరాను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ సింధుఆదర్శ్‌రెడ్డి, స్థానిక నాయకులు, కాలనీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్‌
- దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపు



కార్మికులతో మాట్లాడుతున్న మహిపాల్‌

జహీరాబాద్‌ టౌన్: కార్మిక చట్టాలను అమలుచేసి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్‌ డిమాండ్‌ చేశారు. మండల పరిధిలోని బూచినెల్లి పారిశ్రామిక వాడలోని పలు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులతో కలిసి మంగళవారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యాలు కార్మికులను శ్రమదోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐఈ ఆటోమోటివ్‌ ఇండియా పరిశ్రమ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సందీప్‌రెడ్డి, వివిధ పరిశ్రమల, నాయకులు పాషా, నగేష్‌, వీరశెట్టి పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు రూ.26వేలు చెల్లించాలి

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌ కుమార్‌ డిమాండ్‌ చేశారు. ఈ నెల16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె సందర్భంగా ఆశావర్కర్స్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో ఆత్మకూర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బందికి మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్‌ యూనియన్‌ నాయకులు లావణ్య, యశోద, మాధవి, శశికళ, శోభారాణి, బాలమణి, లక్ష్మీ, జ్యోతి పాల్గొన్నారు.

వినతిపత్రం, సమ్మె నోటీసు అందజేత

జోగిపేట(అందోల్): జోగిపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను బెదిరిస్తూ వేతనాల్లో కోతలు విధిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ అందోల్‌ డివిజన్‌ కార్యదర్శి విద్యాసాగర్‌ డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం జోగిపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ రమేష్‌కు వినతిపత్రం, సమ్మె నోటీసు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్‌ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. హాస్పిటల్‌ కాంట్రాక్ట్‌ కార్మికులు శ్రావణ్‌, హరి, మల్లేశం, మల్లేశం, రాజు జయమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులతో సంతకాల సేకరణ

జోగిపేట(అందోల్): ఈ నెల 16న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొనాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ఆధ్వర్యంలో జోగిపేటలో రవాణా రంగ కార్మికులకు కరపత్రాలు అందజేసి సంతకాల సేకరణ చేపట్టారు. సీఐటీయూ డివిజన్‌ కార్యదర్శి విద్యాసాగర్‌, నాయకులు దుర్గయ్య, మల్లేశం, రవాణా రంగ కార్మికులు రమేష్‌, శివ రాజ్‌, రాజు, పోతాగౌడ్‌, మురళి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న హత్నూర కేజీబీవీ విద్యార్థినులు

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రంలోని కేజీబీవీ గురుకుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా ఇందు, ఎస్‌ఓగా అశ్విని, కలెక్టర్‌గా అపూర్వ, డిప్యూటీ ఈఓగా శిరీష, ఎంఈఓగా భవాని, ఉపాధ్యాయ రాలుగా గీత, అశ్విని, స్ఫూర్తి, ఐశ్వర్య, మధు, సోని, నిఖిత, మానస వ్యవహరించినట్లుగా పాఠశాల ప్రత్యేక అధికారి జయలక్ష్మి తెలిపారు.

'పేట' సీఐగా బాలస్వామి

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): సదాశివపేట సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ గా బాలస్వామిని నియమిస్తూ మంగళవారం ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన నవీన్‌ కుమార్‌ ను ఐజీ ఆఫీస్‌ లో రిపోర్ట్‌ చేయాలని ఆదేశించారు. నేడో, రేపో బాలస్వామిని బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. బాలస్వామి వికారాబాద్‌ సీసీఎస్‌ నుంచి ఎక్కడికి బదిలీ అయ్యారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మునిపల్లి(అందోల్): మండలంలోని చీలపల్లి, కల్లపల్లి బేల్లూర్‌ గ్రామ శివారులోని కంకర మిషన్‌ను మంగళవారం ప్రత్యేక అధికారి దశరథ్‌ సందర్శించారు. సీజ్‌ చేసిన మిషన్‌ను ఎలా నడుపుతున్నారని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం వేస్తే రూ.1000 జరిమానా

మునిపల్లి(అందోల్): రోడ్లపై చెత్త వేసిన వారిపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.1000 జరిమానా విధిస్తామని మండల పంచాయతీ అధికారి అంజలిదేవి హెచ్చరించారు. మండలంలోని తాటిపల్లి గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైన్స్‌షాపు దగ్గర, ప్రజలు తిరిగే ప్రదేశాల్లో చెత్తచెదారం వేయవద్దన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్‌ ఫరీన్‌షేక్‌ హెచ్చరించారు. సంగారెడ్డిలోని తహసీల్దార్‌ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగారెడ్డి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనట్లు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా భూములను గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. సంగారెడ్డిలోని కల్వకుంటలో 354 సర్వే నెంబర్‌ 395, 396లో 17 గుంటల భూమి ఆక్రమణకు గురికావడంతో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బొబ్బిలి కుంటలలో కబ్జాకు గురైన భూములను గుర్తించినట్లు తెలిపారు. సంగారెడ్డి మండలం హనుమాన్‌ గడ్డలోని సర్వేనెంబర్‌ 404లోని 256 ఎకరాల భూమిలో అక్రమ నిర్మాణాలు, అనుమతులులేని వెంచర్లు వెలిశాయన్నారు. వాటిని త్వరలోనే కూల్చివేసి నోటీసులు అందజేస్తామన్నారు. హనుమాన్‌గడ్డ, ఇస్మాయిల్‌ఖాన్‌పేట్‌ గ్రామాల్లో నాలుగు ఇసుక ఫిల్టర్లు కూల్చివేశామని తెలిపారు. వారిపై కేసులు కూడా నమోదు చేశామన్నారు. ఎవరైనా ఇసుక ఫిల్టర్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల్లో ఇటుకబట్టీలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

చెత్త పారబోతపై గ్రామస్తుల ఆగ్రహం

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రి చెత్తాచెదారాన్ని చౌటకూర్‌ మండలం గంగోజీపేట గ్రామ శివారులో డంప్‌ చేస్తుండటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్రామస్తులు కలెక్టర్‌ వల్లూరు క్రాంతికి మంగళవారం ఫిర్యాదు చేశారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రోగులకు వినియోగించిన సిరంజీలు, నిడిల్స్‌, గ్లూకోజ్‌ బాటిల్స్‌, పైపులు, సిరప్‌ బాటిల్స్‌ తదితర చెత్తను లారీల్లో తీసుకువచ్చి డంప్‌ చేసున్నారని కలెక్టర్‌కు వివరించారు. ఆస్పత్రిలోని చెత్తను సంగారెడ్డి మునిసిపాలిటీ శానిటేషన్‌ సిబ్బంది సేకరించాల్సి ఉండగా శానిటేషన్‌ సిబ్బంది నిర్లక్ష్యంతో గంగోజీపేట గ్రామంలో పారబోస్తున్నారన్నారు. అదేవిధంగా గ్రామానికి చెందిన పలువురు దళితులకు ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్‌ భూముల్లో చెత్తను పారబోస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై విచారణ జరిపించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఉచిత వైద్య శిబిరం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్‌ డివిజన్‌ పరిధిలోని బొంబాయి కాలనీలో హ్యాండ్‌ ఆఫ్‌ హోమ్‌ మెడికల్‌ టీమ్‌ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్‌ సింధు మంగళవారం ఆదర్శ్‌ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ **రామచంద్రారెడ్డి నగర్‌ ప్రధాన కార్యదర్శిగా తాళ్ల తిరుమల్‌గౌడ్‌**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని రామచంద్రారెడ్డినగర్‌ కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శిగా తాళ్ల తిరుమల్‌గౌడ్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కార్యవర్గంలో తిరుమల్‌గౌడ్‌ వివిధ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

◆ **జహీరాబాద్‌ ఎస్‌ఐ శ్రీకాంత్‌ బదిలీ**

జహీరాబాద్‌ టౌన్: జహీరాబాద్‌ టౌన్‌ ఎస్‌ఐ శ్రీకాంత్‌ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుమ్మడిదల ఎస్‌ఐగా ఉన్న లక్ష్మారెడ్డి బదిలీపై రానున్నట్లు తెలిసింది. శ్రీకాంత్‌ను సంగారెడ్డి సీసీఎస్‌కు బదిలీపై వెళ్తున్నారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు ఉత్తుర్వులు జారీ చేశారు.


◆ **అందోలు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా శ్రీలత**

జోగిపేట(అందోల్): అందోలు గురుకుల రెసిడెన్షియల్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌గా శ్రీలత మంగళవారం బాధ్యతలను చేపట్టారు. నాగర్‌కర్నూల్‌ జిల్లా తెలకపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శ్రీలత బదిలీపై అందోలు పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ రత్నరాజు, ఉపాధ్యాయులు శ్రీలతకు పుష్ప గుచ్ఛం అందజేశారు.

◆ **క్యాలెండర్‌ ఆవిష్కరణ**

జహీరాబాద్: డివిజన్‌ పరిధిలోనిపారా మెడిక్స్‌ ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్‌ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ వ్యవస్థాపకులు సుధాకర్‌, అశోక్‌కుమీర్‌, జిల్లా అధ్యక్షుడు షేక్‌ తాజొద్దీన్‌, యూనియన్‌ నాయకులు ఉతయ్‌కుమీర్‌, రమేష్‌ పవార్‌, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ **తప్పిపోయి పోలీస్‌స్టేషన్‌కు చేరిన బాలుడు**



నారాయణఖేడ్: ఖేడ్‌లో తప్పిపోయిన బాలుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరాడు. నాలుగేళ్ల వయస్సు బాలుడు మంగళవారం ఖేడ్‌ శివాజీచౌక్‌ ప్రాంతంలో ఏడుస్తుండటాన్ని స్థానికులు గుర్తించారు. బాలుడిని ప్రశ్నించగా వివరాలు చెప్పే పరిస్థితి లేకపోగా ఏడుస్తుండంతో బాలుడిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. మంగళవారం సంత రోజు కావడంతో తల్లిదండ్రులతో వచ్చిన బాలుడు తప్పిపోయి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాలుడిని ఎవరైనా గుర్తుపడితే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

◆ **తాళం వేసిన రెండిళ్లలో చోరీ**

హత్నూర(సంగారెడ్డి): తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌ చేసి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన పరిధిలోని రెడ్డి ఖానాపూర్‌ గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. వడ్ల కల్యాన్‌ చారి, దేవనోల్ల శివరాజ్‌ రెండు ఇళ్లలో ఎవరూ లేకపోవడంతో పాటు తాళం వేసి ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇరుగుపొరుగు వారి ద్వారా విషయం తెలుసుకున్న సంబంధిత ఇళ్ల యజమానులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు ఇళ్లల్లో నగదు, నగలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు.

◆ **రౌడీషీటర్లకు కౌన్సిలింగ్‌**

జహీరాబాద్‌ టౌన్: శాంతి భద్రతలకు విఘాతం కలగిస్తే కఠిన చర్యలు తప్పవని జహీరాబాద్‌ టౌన్‌ సీఐ రవి హెచ్చరించారు. జహీరాబాద్‌ పట్టణంలోని రౌడీషీటర్లు, చెడు వ్యసనాల బారిన పడిన వారిని పిలిపించి తన కార్యాలయంలో కౌన్సిలింగ్‌ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూతగాదాల్లో తలదూర్చరాదన్నారు. భూతగాదాల పరిష్కారం కోసం కోర్టును ఆశ్రయించాలన్నారు. రౌడీ షీటర్లను ఆశ్రయిస్తే వారిపై కూడా క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జహీరాబాద్‌ టౌన్‌ ఎస్‌ఐ శ్రీకాంత్‌ ఉన్నారు.

◆ **జోగిపేట సీఐగా అనిల్‌కుమార్‌**

జోగిపేట(అందోల్): జోగిపేట సర్కిల్‌ ఇన్స్‌పెక్టర్‌గా అనిల్‌కుమార్‌ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. జోగిపేట సీఐగా విధులు నిర్వహిస్తున్న నాగరాజు ఐజీపీ మల్టీజోన్‌–2 కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. హైదరాబాద్‌ పరిధిలోని బహదూర్‌పూర్‌ పోలీస్‌స్టేషన్లో స్టేషన్‌ హౌస్‌ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న అనిల్‌కుమార్‌ను జోగిపేట సీఐగా పోలీస్‌ ఉన్నతాధికారులు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

◆ **అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలి**

నారాయణఖేడ్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకొని క్షమాపణ చెప్పాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. బాల్కసుమన్‌ వ్యాఖ్యలను నిరసిస్తూ నారాయణఖేడ్‌లోని ఇందిరాచౌక్‌లో మంగళవారం కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో బాల్కసుమన్‌ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు భోజిరెడ్డి, పండరిరెడ్డి, లింగారెడ్డి, రాజు, ముంతాజ్‌, గంగారెడ్డి, యూసుఫ్‌ తదితరులు పాల్గొన్నారు.